# నిర్మల్‌లో గంజాయి మత్తులో అమానుషం

### మైనర్ బాలికలపై..
### అఘాయిత్యం: నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో శాంతిభ ద్రతలకు సవాలు విసురుతూ గంజాయి మత్తులో ఇద్దరు యువకులు మైనర్ బాలికలపై చేసిన అమానుషం స్థానికంగా పెను కలకలం రేపింది.సోఫీ నగర్ కాలనీలో నివాసముంట్ను ఇద్దరు దళిత మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని నిందితులు అబ్బాస్ ఖాన్,షేక్ కలీమ్ పక్కా పథకం ప్రకారం ఈ ఘాతకానికి ఒడిగట్టారు.గత కొంత కాలంగా గంజాయి,ఇతర వ్యసనాలకు బానిసలైన ఈ యువకులు,కాలనీలో ఉన్న బాలికలను మభ్యపెట్టి, గంజాయి మత్తులో వారిని బలవంతంగా అపహరించారు.నిందుతులు బాలికలను పట్టణ శివార్లలోని పోచంపాడు పార్కు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు.అక్కడ వారు ఒక బాలికపై లైంగిక దాడికి పాల్పడగా,మరో బలిక వారి నుంచి పెనుగులాడి చాకచక్యంగా తప్పించుకుంది,భయంతో వణికిపోతు ఇంటికి చేరుకున్న ఆ బాలిక,జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు,కాలనీ వాసులకు వివరించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.దీంతో అగ్రహానికి గురైన స్థానికులు పెద్ద ఎత్తున పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### రంగంలోకి దిగిన పోలీస్ యంత్రాంగం..

ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల తక్షణమే స్పందించారు. ఎఎస్పి సాయి కిరణ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి.గంటల వ్యవధిలోనే నిందితులు అబ్బాస్ ఖాన్,షేక్ కలీమ్‌లను గాలించి పట్టుకున్నారు.బాధితులు ఎస్పి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో,నిందితులపై నిర్మల్ పోలీసులు తీవ్రమైన పోక్సో చట్టంతో పాటు ఎస్సి,ఎస్టి అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు.బాధితులకు మానసిక ధైర్యాన్ని అందించడానికి తదుపరి వైద్య పరీక్షల కోసం వారిని వెంటనే సఖి కేంద్రానికి తరలించారు.

### గంజాయి మహమ్మారిపై
### ఎస్‌పి సీరియస్..

ఈ సందర్బంగా ఎస్‌పి జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి విక్రయాలు,వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.మైనర్ బాలికలపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిని సమాజం క్షమించదని,చట్టపరంగా వారికి అత్యంత కఠినమైన శిక్షలు పడేలా చూస్తామని హెచ్చరించారు. మహిళల భద్రత విషయంలో నిర్మల్ పోలీసు యంత్రాంగం రాజీ పడబోదని,పట్టణంలో నిఘాను మరింత పెంచుతామని ఆమె భరోసా ఇచ్చారు.ఈ ఘటనతో సోఫీ నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు ఆలముకోగా,నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



## కావేరి యూనివర్సిటీకి...
## ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రదానం




**ప్రజాపక్షం / గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గౌరారం శివారులోని కావేరి యూనివర్సిటీ ఉత్తమ విశ్వవిద్యాలయ అవార్డు దక్కించుకుంది. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ హర్ష పోల్సాని అవార్డు అందుకున్నారు. చక్కటి సాంకేతిక నైపుణ్యం, నూతన ఆవిష్కరణలు సత్ఫలితాలిస్తుండగా, విద్యార్థుల పట్ల సంస్థ అంకితభావం, నిబద్ధత, అందుతున్న పరిజ్ఞానం దృష్టిలో పెట్టుకొని కావేరి విశ్వవిద్యాలయానికి ఉత్తమ యూనివర్సిటీ అవార్డు దక్కినట్లు కావేరి యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ భాస్కర్ రావు స్పష్టం చేశారు. వ్యవసాయం, సాంకేతికత ఆధారిత పరిష్కారాల్లో నూతన పరిశోధన, పరిశ్రమలకు అనుగుణమైన కోర్సులు, స్థిరమైన అభివృద్ధి, ఉన్నత విద్యకు కావేరి యూనివర్సిటీ అందిస్తున్న గొప్ప గుర్తింపుకు ఈ అవార్డు ప్రామాణికంగా నిలిచిందని వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు వివరించారు.

## ప్రపంచానికి నాగరికతను..
## పరిచయం చేసింది హిందూ మతమే

### మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి..




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రపంచంలోనే మొట్టమొదటి మతం హిందూ మతమని,అది ప్రపంచానికి నాగరికతను నేర్పిందని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పేర్కొన్నారు.ఆదివారం నిర్మల్ పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో బుధవార్ పేట వివేక్ నగర్ బస్తీ హిందూ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాని ముఖ్య అతిథిగా హాజరైన అయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు.యుగయుగాల నుండి నేటి వరకు హిందూ మతాన్ని ఎవరూ ఏమీ చేయలేకపోయారని,మన ధర్మమే మనకు శ్రీరామరక్షగా నిలుస్తుందని ఆయన అకాంక్షించారు.హిందూ మతం కేవలం భారతదేశానికే పరిమితం కాలేదని,ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ ఈ ధర్మాన్ని విశ్వసించే వారు లక్షలాది మంది ఉన్నారని వివరించారు.మనం ఆపదలో ఉన్నావారిని అదుకున్నప్పుడే మన ధర్మాన్ని నిజంగా కాపాడుకున్న వాళ్లమౌతామని ఆయన పిలుపునిచ్చారు.తోటి మనిషికి సహాయం చేయడమే హిందూ ధర్మం యొక్క మూల సూత్రమని గుర్తు చేశారు.ఈ సమ్మేళనంలో బస్తీ ప్రజలు,హిందూ ధర్మప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో
## 5,662 కేసులలో రాజీ




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ కమీషనరేట్ ముందంజలో ఉందని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 5662 కేసులలో రాజీ కుదుర్చుకోవటంతో పాటు సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ.31,82,649 లను తిరిగి సైబర్ బాధితులకు అందించనున్నామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెఇపారు. 2026 మార్చి 28 వరకు జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన రాజీ పడటానికి అవకాశం ఉన్న చాలా కాలంగా పెండింగ్‌లోని కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదర్చటం జరిగిందన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కి కాల్ చేసి గానీ వెబ్‌సైట్ పోర్టల్ నందు లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు సక్రమంగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేసిన అధికారులు సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, సిఐ ముఖిద్‌పాషా, సీసీఆర్‌బీ సీఐ అంజయ్య, కోర్ట్ డ్యూటీ, సైబర్‌సెల్ సిబ్బంది అభినందించారు.

## లారీ చక్రాల కింద పడి
## తొమ్మిది నెలల చిన్నారి మృతి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** నస్పూర్ పట్టణంలోని సీతారాంపల్లి గ్రా మంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో తొమ్మిది నెలల చిన్నారి లక్కీ లారీ చక్రాల కింద పడి మృతి చెందింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సమీపంలోని పెద్దబూదె గ్రామానికి చెందిన లింగంపల్లి మౌనిక, రాజు దంపతులు ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి నివసిస్తున్నారు. వీరి రెండో కూతురు లక్కీ ఆడుకుంటుండగా, ఇటుకల తయారీకి ఫ్లై యాష్ తీసుకువచ్చిన లారీ డ్రైవర్ గమనించకుండా వాహనాన్ని రివర్స్ చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ చక్రాల కింద పడిన పాపపై డ్రైవర్ బూడిదను డంపింగ్ చేయడంతో చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వైభవంగా మట్టాల ఆదివారం వేడుకలు

**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో మట్టాల ఆదివారం (పామ్ సండే) వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యేసుక్రీస్తు యెరూషలేము ప్రవేశాన్ని స్మరించుకుంటూ భక్తులు చేతుల్లో ఈత ఆకులు పట్టుకొని పట్టణంలోని మార్కెట్ వీధుల గుండా ఊరేగింపుగా సాగారు. క్రీస్తు గానాలు ఆలపిస్తూ స్థానిక సిఎస్ఐ చర్చికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఇర్మియ మాట్లాడుతూ యేసుప్రభువు వినయంతో యెరూషలేము నగరంలోకి ప్రవేశించిన రోజును గుర్తుచేసుకుంటూ ఈ పండుగ జరుపుకుంటామని తెలిపారు. ప్రజలు ఆయనకు గౌరవ సూచకంగా తాటి ఆకులు ఊపుతూ స్వాగతం పలికిన సంఘటనకు గుర్తుగా ఈ సంప్రదాయం కొనసాగుతోందని వివరించారు. ఈ పండుగతో ప్రారంభమయ్యే పవిత్ర వారంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. చర్చి సెక్రటరీ సంతపురి సునీల్, స్టువర్ట్ రాజశేఖర్, ట్రెజరర్ పద్మారావు, సామ్యూల్, క్రిస్టఫర్, కిరణ్ కుమార్, సంధ్య ఇర్మియ, మధుసూదన్ పాల్గొన్నారు.



## అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ విద్యనందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిజామాబాద్ అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ విద్యనందించడమే తమ లక్ష్యమని పాఠశాల డైరెక్టర్ రామోజీ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్‌లో కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థుల రోబోటిక్స్ ప్రదర్శనలు గత 2 రోజులుగా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ వేడుకలు ఆదివారంతో ముగిసాయి. ఐఐటి ఫౌండేషన్, ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ రోబోట్ ఫెస్ట్‌ను నిర్వహించామని డైరెక్టర్ రజనీకాంత్ తెలిపారు. రెండవ రోజైన ఆదివారం సెలవుదినం కావటంతో తల్లిదండ్రులు, విజిటర్స్ తాకిడి శనివారం కంటే ఎక్కువైందని ప్రదర్శనలేను వీక్షించిన ప్రజలు తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇంత మంచి ప్రోగ్రాంను నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ప్రతిభ నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు వ్యక్తిగత మెడల్స్‌ను అందించిన యాజమాన్యం, మున్ముందు నిజామాబాద్‌లో అం తర్జాతీయస్థాయి ఒలంపియాడ్ విద్యనందించడమే తమ లక్ష్యమని ఇలాంటి రోబోఫెస్ట్‌లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి అతి పెద్ద రోబో ఫెస్ట్‌ను నిర్వహించటం మాకెంతో గర్వకారణమని ఇందుకోసం రోబోటిక్ స్టాఫ్, టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్, ఇతర స్టాఫ్ అందరి కృషి మరువలేనిదని వారిని అభినందించారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేయొద్దు

### ఎఐటియుసి జిల్లా
### ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సిర్పూర్ టి మండల కేంద్రంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మండల అధ్యక్షురాలు ఎర్ర కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్షయ పాత్ర వంటి సంస్థలకు నియోజకవర్గ కేంద్రాల్లో స్థలాలు కేటాయించడం సరికాదని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 54,200 మంది వంట కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వంట కార్మికులకు 10 వేల రూపాయల వేతనాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న 600 రూపాయల వేతనం శ్రమ దోపిడీయేనని, కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను ప్రతి విద్యార్థికి 25 రూపాయలకు పెంచాలని లేదా వంట సరుకులు, గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో వచ్చే విద్యా సంవత్సరం జూన్ నెల నుండి నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని వంట కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న అల్పాహారం బిల్లులు, వేతనాలు, వంట బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కులాలతో సంబంధం లేకుండా బిల్లులన్నింటినీ కలిపి ఒకేసారి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బుజ్జమ్మ, విజయ, సురేఖ, శ్రీదేవి, ఆశక్క, లక్ష్మి పాల్గొన్నారు.




## కీచక ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

### ఎస్సి,ఎస్టి ఉపాధ్యాయ
### సంఘం,గిరిజన సంఘాల గర్జన..!

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ పాఠశాలలో గిరిజన విద్యార్థినుల పట్లఅమానుషంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడి ఉదంతం జిల్లాలో పెను దూ మారం రేపుతోంది.నిందితుడిపై పోక్సో కేసు న మోదై వారం రోజులు గడుస్తున్నా,పోలీసులు ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడంపై ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయ సంఘం,వివిధ గిరిజన సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి.విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే వేధింపులని వారు మండిపడుతున్నారు.బాధిత విద్యార్థినులు గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారు కవడంతో,నిందితుడిపై కేవలం పోక్సో చట్టమే కాకుండా ఎస్సి,ఎస్టి అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయాలని ఉపాధ్యాయ,గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.అమాయక గిరిజన బాలికల బలహీనతను,అమాయకత్వాన్ని అసరాగా చేసుకుని లైంగిక వేధింపులకు గురిచేయడం క్షమించరాని నేరమని వారు పేర్కొన్నారు.గతంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో సస్పెండ్ అయిన సదరు ఉపాధ్యాయుడు,ఇప్పుడు ఏకంగా విదాయిర్థినుల జీవితాలతో అడుకోవడం అతని వికృత చేష్టలకు అద్దం పడుతోందని ఆరోపించారు.

### రెండు రోజుల్లో చర్యలు ఎస్ఐ

ఈ విషయమై నిర్మల్ రూరల్ ఎస్పై స్పందిస్తూ.. జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న ఇతర ఉద్రిక్త సంఘటనల వల్ల విచారణలో కొంత ఆలస్యం జరిగిందని,అయితే నిందుతుడి కోసం గాలింపు ముమ్మరం చేశామని తెలిపారు.మరో రెండు మూడు రోజుల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇచ్చారు.



### ఆందోళన తప్పదు..!

నిందుతుడిని తక్షణమే అరెస్ట్ చేయకపోతే,జిల్లా వ్యాప్తంగా గిరిజన సంఘాలు ,ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి చేపడుతామని నేతలు హెచ్చరించారు. అమాయక విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

## వయోజనులకు అక్షరాస్యత పరీక్ష నిర్వహణ

### జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం

**ప్రజా పక్షం / జన్నారం :** జన్నారం మండలంలోని ఉల్లాస్ అక్షర కేంద్రాల్లో చదువుకుంటున్న వయోజనులకు ఆదివారం అక్షరాస్యత పరీక్షను నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో అమ్మకు అక్షరమాల ఉల్లాస్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. జన్నారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం సందర్శించి పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, మంచిర్యాల జిల్లాను 100 శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరీక్షల నిర్వాహణ తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ నాణ్యత సమన్వయ కర్త సత్యనారాయణ మూర్తి, మండల కార్యక్రమ నిర్వాహకురాలు లలిత కుమారి, జిల్లా వనరుల వ్యక్తి కందుల తిరుపతి, సుమన్ పాల్గొన్నారు.



## నిషేధిత గంజాయి మొక్కల గుర్తింపు

### కెరమెరి ఎస్ఐ మధుకర్

**ప్రజా పక్షం / కెరమెరి :** కెరమెరి మండలం బీమాన్ గొండి గ్రామంలో పోలీసులు ఐదు గంజాయి మొక్కలను గుర్తించారు. గోయాగం గ్రామ పంచాయతీకి చెందిన సిడం రాజు తన ఇంటి పెరట్లో వీటిని పెంచుతున్నట్లు పోలీసులు కనుగొన్నారు. ఈ మొక్కల విలువ సుమారు 50 వేల రూపాయలు ఉంటుందని కెరమెరి ఎస్ఐ మధుకర్ తెలిపారు. జిల్లా ఎస్పి నితిక పంత్, ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. గ్రామాల్లో గంజాయి సాగుపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. నిషేధిత పంటల నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులు దూసుకెళ్లాలి

### జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి

**ప్రజాపక్షం/నిర్మల్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ)వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై దృష్టి సారించి,తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి శ్రీవాణి పిలుపునిచ్చారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో నిర్వహించిన వశిష్ట డిగ్రీ కళాశాల రజతోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.మున్సిపల్ చైరపర్సన్ కావ్య,వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి,కళాశాల డైరెక్టర్ సత్యనారాయణ గౌడ్,కరస్పాండెంట్ ఎన్ ఆర్. స ర్వోత్తమ్ రెడ్డి,ప్రిన్సిపాల్ అఖిలేష్ కుమార్ సింగ్‌ల తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

### క్రమశిక్షణే విజయానికి సోపానం..

న్యాయమూర్తి శ్రీవాణి మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ,నైతిక విలువలు నిరంతర శ్రమను అలవరచుకుంటే ఏ రంగంలోనైనా రాణించడం సులభమవతుందని అన్నారు.తల్లిదండ్రులు ఎంతో శ్రమకోర్చి చదివిస్తున్నారని,వారి కలలు, నిజం చేస్తూ ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని సూచించారు.సమాజం పట్ల అవగాహన,దేశభక్తిని పెంపొందించుకుంటూ సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. అలాగే,విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన గురువులను ఎన్నటికీ విస్మరించకూడదని ఆమె హితవు పలికారు.

### వ్యసనాలకు దూరంగా ఉండాలి..

ప్రస్తుత కాలంలో కొంతమంది యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు.అటువంటి మార్గాల్లోకి వెళ్లకుండా,ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.వశిష్ట కళాశాల సేవలు అభినందనీయం 2001లో స్థాపించిన వశిష్ట కళాశాల 25ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని న్యాయమూర్తి కొనియాడారు.కళాశాల విజయవంతంగా కొనసాగడానికి సహకరించిన యా జమాన్యానికి,తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.




## అడవితల్లి ఒడిలో ఇప్పపూల పరిమళం

### వసంతం రాకతో పల్లెల్లో సందడి

**ప్రజాపక్షం / తిర్యాణి :** వసంత ఋతువు రాకతో తిర్యాని అడవులు మళ్లీ జీవకళను సంతరించుకున్నాయి. అడవి తల్లే జీవనాధారంగా బతికే గిరిజన పల్లెల్లో ఇప్పపూల పరిమళం కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. తెల్లవారుజామునే గిరిజనులు బుట్టలు చేతబూని అడవుల బాట పడుతున్నారు. ఈ ఇప్పపూల సేకరణ కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, మారుమూల గిరిజన కుటుంబాలకు వేసవి కాలంలో ప్రధాన ఆర్థిక వనరుగా నిలుస్తోంది. పూర్వం గిరిజనులు 100 నుంచి 118 ఏళ్ల వరకు నిండు నూ రేళ్ల ఆరోగ్యంగా జీవించేవారని గిరిజన పెద్దలు గుర్తు చేసుకుంటున్నారు. వారి సుదీర్ఘ ఆయుష్షు వెనుక ఇప్పాపు సారం అనే సంప్రదాయ పానీయం ప్రధాన పాత్ర పోషించేది. ఇది శరీరానికి శక్తిని ఇవ్వడమే కాకుండా రోగ నిరోధక శక్తిని పెంచుతుందని వారు బలంగా విశ్వసిస్తారు. రసాయనాలు లేని రాగులు, సజ్జలు, జొన్నలు, మక్కలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం, అటవీ ఔషధ మొక్కలతోనే చిన్నపాటి వ్యాధులను నయం చేసుకోవడం వల్ల వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేవారు.ఇప్పపూల సేకరణ సమయంలో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పపూల వాసనకు ఆకర్షితమై ఎలుగుబంట్లు వచ్చే అవకాశం ఉన్నందున ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. గుంపులుగా వెళ్లాలని, వన్యప్రాణుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు.



### కనుమరుగవుతున్నసహజ జీవనశైలి

మారుతున్న కాలంతో పాటు గిరిజన సంప్రదాయాలు, సహజ జీవన విధానం క్రమంగా కనుమరుగవుతున్నాయి. అడవులు తగ్గిపోవడం, రసాయన ఎరువుల వాడకం పెరగడం వల్ల పాత తరం నాటి ఆరోగ్య రహస్యాలు నేటి తరానికి అందడం లేదు. యువత ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్తుండటంతో అటవీ జ్ఞానం వారసత్వంగా అందడం లేదు. 'మా పూర్వీకులు ప్రకృతితో జీవించారు.ఇప్పుడు మేము ప్రకృతిని కోల్పోతున్నాం' అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సంరక్షణ చర్యలు అవసరం

ప్రకృతిపై ఆధారపడి జీవించే గిరిజన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సామాజిక సంస్థలపై ఉంది. ఇప్ప చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి.

## పచ్చని అటవీ సంపద అగ్నికి ఆహుతి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని వాంకిడి సెక్షన్ పరిధిలోని కొరటికల్ లింగట్ల అరేపల్లి తదితర బీట్ పరిధిలో శనివారం పచ్చని అటవీ సంపద అగ్నికి అహుతి అయిందని గ్రామస్తులు తెలిపారు.ప్రభుత్వాలు లక్షలు వెంచించి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతుంటే వాటిని రక్షించాల్సిన అధికారులు వాటిపై శ్రద్ధ పెట్టక,ఇలా అగ్నికి అహుతి అవుతున్నాయి.ముఖ్యంగా ఎండాకాలం వచ్చిందంటే అటవి సంపద అటవీ ప్రాంతాలలో అగ్నిప్రమాదాలు జరుగుతున్న ఇప్పటివరకు అధికారులు గ్రామాలకు వచ్చి కనీసం అవగాహన కార్యక్రమలు నిర్వహించకపోవడం దీనికి నిదర్శంగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని అంటున్నారు ముఖ్యంగా ఫైర్ లైన్లు ఏర్పాటు చేయకపోవడం చేసిన ఆచరణలో కనిపించకపోవడం చూస్తుంటే అటవీ అధికారుల పని తీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని అంటున్నారు.లక్షల మొక్కలు ఈ విధంగా కాలిపోతుంటే పచ్చని ప్రగతికి ఎంతటి నష్టం వాటిల్లుతుందో గ్రహించాలని ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలుపునారవృత్తం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆ విధంగానైనా కొంత అటవీ సంపదను కాపాడుకోగలుగుతామని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



## అల్లీపూర్‌లో కెజిబివిని తనిఖీ చేసిన కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట: చిన్నకోడూర్ మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదివారం అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సంధర్భంగా విద్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించి తరగతి గదిలోని విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు.ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచి క్రమశిక్షణ అలవాట్లను అలవర్చుకోవాలని ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని అన్నారు.సమయాన్ని వృధా చేయకుండా ఒక లక్ష్యాన్ని పెట్టుకోని ఉన్నతమైన విలువలతో గమ్యాన్ని చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలని సూచించారు.మెను ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకోని వంటలపై ఆరాతీశారు.భోజన వసతిలో ఎలాంటి లోటుపాట్లు ఉన్న ఎస్‌వో దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3758 కేసుల పరిష్కారం: సిపి



ప్రజాపక్షం/కరీంనగర్: జాతీయ లోక్ అదాలత్ లో కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం మరియు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించబడినవి. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించబడిందని కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 3758 కేసులు విజయవంతంగా పరిష్కరించబడినవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. అదే విధంగా, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. కమీషనరేట్లోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పని చేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని సీపీ పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి



ప్రజాపక్షం/గొల్లపల్లి:ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా ,మరో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గుంజపడుగు లో ఆదివారం చోటుచేసుకుంది .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని గుంజపడుగు కి చెందిన పురాణం లక్ష్మ క్క ,మోతే పోసవ్వ,మోటం కాంతమ్మ లు వారి పనుల నిమిత్తం జగిత్యాలకు వెళుతుండగా ఈ క్రమంలో రంగధాముసపల్లి గ్రామానికి చెందిన నర్రా పవన్ గొల్లపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై అతివేగంగా,అజాగ్రత్తగా నడుపుకుంటూ వస్తూ వారిని ఢీకొట్టాడు.ఈ ఘటనలో పురాణం లక్ష్మ క్కకు కాళ్లకు ,చేతులకు శరీర భాగంలో బలమైన గాయాలైనాయి .మోతే పోసవ్వ కు తలకు ,చేతులకు బలమైన రక్త గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పురాణం లక్ష్మ క్క ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందింది .తీవ్ర గాయాలైన మోతే పోసవ్వ ను మెరుగైన చికిత్స కోసం జగిత్యాల లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు . విషయం తెలుసుకున్న ధర్మపురి సిఐ రామ్ నరసింహారెడ్డి హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.మృతురాలి కొడుకు పురాణం సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఎం కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ సందర్భంగా ధర్మపురి సిఐ మాట్లాడుతూ వాహనాదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందిగా తెలియజేస్తూ ,మద్యం సేవించి వాహనం నడప రాదని వాహనదారులకు సూచించారు .వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించని యెడల వారి పైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## మొరం అక్రమ రవాణాపై గ్రామస్తుల అడ్డగింత



ప్రజాపక్షం/మల్లాపూర్: సెలవు దినాన అధికారులు ఎవరు ఉండరనే ధీమాతో పొలిమేరలు దాటి అక్రమంగా తరలిస్తున్న మొరం దందాను వేంపల్లి గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వేంపల్లి గ్రామ శివారులోని వేల్పుల గంగారెడ్డి అనే రైతుకు చెందిన భూమి నుండి రేగుంట గ్రామ శివారులో రహదారి పక్కనే నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫారం నిర్మాణానికి జెసిబి తో ట్రాక్టర్లలో అక్రమంగా మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకోవడంతో వివాదానికి దారితీసింది. భూయజమానికి ఎలాంటి సమాచారం లేకుండా ఎస్సారెస్పీ కాలువను పూడ్చి దాని మీదుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకోవడంలేదని వాపోయారు. అడ్డుకున్న తమపై అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులు బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. కాగా ఈ తతంగమంతా సదరు జిపిఓ స్థాయి ,రెవిన్యూ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోగా సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఉండడం గ్రామస్తుల్లో మరింత అనుమానాలను కలిగించింది. ఇలాంటి సంఘటనలపై చిలికి చిలికి గాలి వానలా మారక ముందే అధికారులు అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అన్ని రంగాల్లో జగిత్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ : జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 6వ వార్డులో రూ. 10 లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల పట్టణంలోని 50 వార్డుల్లో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేబడుతామన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, నాయకులు ఎల్లారెడ్డి, మన్సూర్, సురేందర్ రావు, నాగయ్య, మధు, కౌన్సిలర్ చిటి లక్ష్మి నారాయణ తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రానికి చెందిన బుర్ర సునీతకు మంజూరైన రూ. 5 లక్షల ఎల్‌వోసిని ఎమ్మెల్యే అందజేశారు. రామకృష్ణా రెడ్డి, నాగ రాజు తదితరులు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రి, ఆపి, రోటరి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గంలోని 12 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అద్దాలు, మందులు పంపిణీ చేశారు. వైద్యులు విజయ్, రామకృష్ణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు ఉన్నారు. అలాగే జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, గొల్లపెల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేని కలిసి తమ గ్రామాల సరిహద్దు సమస్య పరిష్కరించేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గ్రామ నాయకులు ఉన్నారు.

## మానేరు రివర్ ఫ్రంట్‌పై ఉన్నత స్థాయి సమీక్ష

### ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించిన ఇన్‌చార్జి మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/కరీంనగర్: జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్ లోని అసెంబ్లీ హాల్ లో మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్, టూరిజం ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశంలో మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతి, పెండింగ్ నిధులు, ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భూ సేకరణ,అంచనా వ్యయం, నీటిపారుదల, పర్యాటక శాఖ కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి నివేదికలపై ఆరా తీశారు. త్వరలో మానేరు రివర్స్ ఫ్రంట్ పై మంత్రుల క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నట్లు తెలిపారు.



## వంద శాతం అక్ష్యరాస్యత మహిళా సంఘాల ద్వారానే సాధ్యం



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : నిరక్ష్యరాస్యత నిర్మూలనకు మహిళా సంఘాల ద్వారా కృషి చేయడం జరుగుతుందని జగిత్యాల జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి యం.రఘువరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్ మండలాల్లో ఆదివారం ఉల్లాస్ నావభారత సాక్షరతా కార్యక్రమం మూల్యాంకన పరీక్ష నిర్వహిణను జగిత్యాల జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి పరిశీలించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతు గ్రామాల్లో చదువు రాని మహిళలను ముందుగా గ్రామ సంఘాల సహాయకుల ద్వారా గుర్తించి వారికీ సాయంత్రం పూట అక్ష్యరాస్యత నేర్పించడం జరిగిందని తదుపరి ఆదివారం జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో ఆయా పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించడం జరిగిందని, జగిత్యాల జిల్లాలో దాదాపు 22,000 మంది మహిళలు చాలా ఉత్సాహంగా పరీక్షల్లో పాల్గొన్నారు. వారి వెంట జిల్లా ఐబీ ఎపియం గంగాధర్, రమాదేవి, మహేష్, గంగరాం, గంగాధర్, ఆయా గ్రామాల సర్పంచ్లులు,ఉప సర్పంచ్లులు, ఎపియంలు, సిసిలు, యంఎస్‌సిసిలు, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య అధ్యక్షులు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు హాజరైనారు.

## అమ్మకు 'అక్షరం'

ప్రజాపక్షం/మల్యాల:జగిత్యాల జిల్లా మల్యాల మండలం లోని పోతారం, రాంపూర్ గ్రామాల లో అమ్మకు అక్షరమాల కార్యక్రమం లో బాగంగా వయో జకులకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళ సంఘ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ వయోజన విద్య డైరెక్టర్ ఆదేశాలననుసరించి పరీక్ష నిర్వహించారు.ఈ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము మండల విద్యాధికారి జైసింహారావు లు పరిశీలించారు.

## నిరక్షరాస్యత లేని డివిజన్‌గా తీర్చిదిద్దుదాం

### మహిళల విద్యే అభివృద్ధికి ప్రతీక
### సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం కార్పొరేషన్ పరిధి 41వ డివిజన్లో ఉల్లాస పథకంలో భాగంగా ఆదివారం రోజున నిరక్షరాస్య మహిళలకు అక్షరాస్యతను నేర్పించడంతోపాటు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్ష కార్యక్రమానికి ఆ డివిజన్ కార్పొరేటర్ సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మెప్మా సి ఓ శమంతక మణి తో కలిసి సూర్య మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్లో 41వ డివిజన్ అన్నింటికంటే భిన్నమైన డివిజన్‌గా అభివృద్ధి చేయడంలో మహిళా సోదరీమణులు సహకరించాలని కోరారు. ఎక్కడైతే మహిళలు ఎక్కువ శాతం విద్యను అభ్యసించి అక్షరాస్యత కలిగిన మహిళలు ఉంటారో ఆ ప్రాంతం అన్ని ప్రాంతాల కంటే ఎక్కువ అభివృద్ధి చెందుతుందని, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అండర్స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ పథకం ద్వారా వీలైనంత మంది నిరక్షరాస్య మహిళలు విద్య నేర్చుకోవాలని సూర్య అభిప్రాయపడ్డారు. ఒక డివిజన్ అభివృద్ధి అంటే ఆ డివిజన్లో మౌలిక సదుపాయాల కల్పన కాకుండా నిరక్షరాస్యులకు అక్షరాస్యత కల్పించడం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లాంటి పనుల వల్ల కూడా డివిజన్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. సమాఖ్య సంబంధించిన ఆర్పీలతో మాట్లాడుతూ మన డివిజన్ కు సంబంధించిన నిరక్షరాస్యుల జాబితా తయారు చేయాలని వారందరికీ త్వరలో ఒక పాఠశాలను ఏర్పాటు చేసి రెండు నెలలపాటు తన సొంత ఖర్చులతో డివిజన్లోని నిరక్షరాస్య మహిళలందరికీ విద్య నేర్పించడానికి ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా సూర్య మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు స్వర్ణలత, సరోజ, సుశీల, సభ్యులు దేవలక్ష్మి, రాధా ,ప్రమీల, సురేఖ, కళావతి, లక్ష్మీ, పోచమ్మ, సమ్మక్క, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



## మాకు మరో అవకాశం కల్పించాలి

### చలో కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడికి బయలుదేరిన డిస్మిస్డ్ కార్మికులు

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో అనారోగ్యం మరియు వివిధ కారణాల వల్ల డిస్మిస్ ఐన కార్మికులకు మరో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కొత్తగూడెం లో జరిగే హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి రామగుండం రీజియన్ కు చెందిన డిస్మిస్ ఐన కార్మికులు ఆదివారం రామగుండం రైల్వే స్టేషన్ నుంచి సింగరేణి ట్రెయిన్ కు బయలుదేరారని సింగరేణి డిస్మిస్ కార్మిక సంఘం నాయకులు శనిగరపు నారాయణ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఉపాధి లేక డిస్మిస్ కార్మికుల కుటుంబాలు అనేక అవస్తలు పడుతున్నారని వారికి మరో అవకాశం కల్పించాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి సేవ్ సింగరేణి పోరు జాత లో మా డిమాండ్ ను కూడా చేర్చి మా కుటుంబాల కోసం పోరాడుతున్నందున హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి డిస్మిస్ కార్మికులు కొత్తగూడెం కు సింగరేణి ట్రేన్ లో వెళుతున్నారని ఆయన పేర్కొన్నారు.



## మీడియాను కించపరిస్తే సహించేది లేదు



ప్రజాపక్షం/జగిత్యాల: మీడియాను అగౌరవ పరిస్తే సహించేది లేదని టియూడబ్ల్యూజె(ఐజెయూ) జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జగిత్యాల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చీటి శ్రీనివాస రావు, బెజ్జంకి సంపూర్ణ చారి, కందుకూరి శశిధర్‌లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం ఇటీవల మిడియాపై అసభ్యకరమైన, అనుచితమైన భాషను ఉపయోగించి పాత్రికేయులను అవమానించిన నేపథ్యంలో భవిష్యత్‌లో కాంతం పాల్గొనే ప్రెస్ మీట్‌లతో పాటు కార్యక్రమాల కవరేజ్‌ను బహిష్కరించాలని టియూడబ్ల్యూజె(ఐజెయూ),జగిత్యాల ప్రెస్ క్లబ్ లు ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రెస్ క్లబ్ ఆవరణలో జర్నలిస్టు సంఘం నాయకులు ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి గజ్జెల కాంతం వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఆత్మ గౌరవాన్ని కించపరుస్తూ, వ్యక్తిత్వాలను హననం చేసేలా వాఖ్యానాలు చేసిన గజ్జెల కాంతం కార్యక్రమాలను, ప్రెస్ మీట్‌లను జగిత్యాల జిల్లా పరిధిలో బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు చేసిన ఏకగ్రీవ తీర్మాణాన్ని సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షుడు నందయ్యలకు పంపినట్లు వివరించారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు కొత్తూరి మహేష్ కుమార్, ముక్క వేణు గోపాల్, దుగ్యాల గోపికృష్ణా రావు, అలిశెట్టి మదన్ మోహన్, జహీర్, హరికృష్ణ, వేణు గోపాల్, బండ స్వామి, ప్రదీప్ కుమార్, హన్మంతు పటేల్, రాజిరెడ్డి, మహేష్, నరేష్, శ్రీధర్ రావు, రంజిత్, హరీష్. షమ్ము, శ్రీకాంత్, సాబీర్, రాజ్ కుమార్, రవి, శ్రీనివాస రెడ్డి, హైదర్ , రమేష్ తదితరులు ఉన్నారు.

## కెటిఆర్‌తో జగిత్యాల నాయకుల సమావేశం

ప్రజాపక్షం/జగిత్యాల :హైదరాబాద్‌లో ఆదివారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరావుతో జగిత్యాల బిఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై కెటిఆర్ చర్చించారు. అనంతరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి విషయంపై చర్చ జరిగినట్లు తెలిపింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బిఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్‌లు ఉన్నారు.



## ఎట్టకేలకు సిద్దిపేట మార్కెట్ కమిటీ పదవులకు మోక్షం

### చిన్నకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మీసం మహేందర్
### సిద్దన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దేవులపల్లి యాదగిరి
### సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పెండింగ్

ప్రజాపక్షం/సిద్దిపేట: కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి నామినేటెడ్ పదవులు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్న పదవులకు ఎట్టకేలకు మొక్షం లభించింది. నియోజక వర్గంలోని సిద్దిపేట, చిన్నకోడూరు, సిద్దన్నపేట మార్కెట్ కమిటి పదవుల్లో సిద్దిపేట మినహా, నంగునూర్ మండలం సిద్దన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఖరారు చేశారు. చిన్నకోడురు మార్కెట్ కమిటి చైర్మన్‌గా మీసం మహేందర్ యాదవ్, నంగునూర్ మండలం సిద్దన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దేవులపల్లి యాదగిరి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట మార్కెట్ కమిటి చైర్మన్ పదవిని మరో సారి పెండింగ్‌లో ఉంచారు. సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌ను జనరల్ మహిళ, చిన్నకోడూరు బిసి జనరల్, సిద్దన్నపేట జనరల్‌కు కేటాయించారు. చిన్నకోడూరు మార్కెట్ కమిటీ కోసం మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన మీసం నాగరాజు, మీసం మహేందర్‌లు తీవ్రస్థాయిలో పోటీపడ్డారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ సైతం రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇద్దరు సోదరులు సైతం నాకంటే..నాకు వస్తుందని పట్టు వదలని విక్రమార్కునిలుగా చివరివరకు పోటీపడ్డారు. చివరికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మీసం మహేందర్‌ను వరించింది. అలాగే నంగునూర్ మండలం సిద్దన్నపేట మార్కెట్ కమిటీ కోసం మండలానికి చెందిన దేవులపల్లి యాదగిరి, రాంపూర్ గ్రామానికి చెందిన రాపోలు రాజబహదూర్‌రెడ్డిలు తీవ్ర స్థాయిలో పోటీపడ్డారు. ఇద్దరు సైతం నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామిలు చుట్టు ప్రదక్షిణలు చేశారు. తమకున్న సీనియర్ నాయకుల ద్వారా అధిష్టానంపై వత్తిడి తెచ్చారు. చివరికి నంగునూర్ మండల కేంద్రానికి చెందిన దేవునిపల్లి యాదగిరికి చైర్మన్ పదవి వరించింది. చిన్నకోడూరు చైర్మన్ పదవి మీసం మహేందర్, సిద్దన్నపేట మార్కెట్ చైర్మన్ పదవి దేవులపల్లి యాదగిరిలు జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి, నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ, సీనియర్ నాయకుడు మైనంపల్లి హన్మంత్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. మీసం మహేందర్, దేవులపల్లి యాదగిరిలు ఆదివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో చార్జ్‌ను తీసుకున్నారు. పలువురు కాంగ్రెస్ నేతలు నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌లను అభినందించారు.

**సిద్దిపేట మార్కెట్ కమిటీ పెండింగ్**

సిద్దిపేట మార్కెట్ కమిటి చైర్మన్ కోసం మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్ సతీమణి, ఎస్సీసెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, అన్నపూర్ణలు తీవ్ర స్థాయిలో పోటీపడుపడుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తమకున్న పరిచయాల ద్వారా పార్టీ అధిష్టానం,జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామిపై వత్తిడి తెచ్చినప్పటికి ఏకాభిప్రాయం కుదరకపోవటం వల్ల పెండింగ్‌లో ఉంచినట్లు సమాచారం.మరో మూడు, నాలుగు రోజుల్లో సిద్దిపేట మార్కెట్ చైర్మన్ నియామకం జరుగుతుందని ప్రచారం జరుగుతుంది. ముగ్గురు అభ్యర్థులు తనకే మార్కెట్ కమిటి చైర్మన్ తనకు వరిస్తుందని ఎవరికి వారుగా పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో రెండు రోజుల్లో తేలనుంది.



